ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ,
రాజకీయ, వివాహ,
జన్మదిన తదితర ప్రకటనల
కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | శుక్రవారం | 03.04.2026 | సంపుటి : 1 | సంచిక : 276 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹62

## పర్సంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

**నేటి నుంచే ఈ విధానం అమలు**

**23 సింగల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన**



హైదరాబాద్,ఏప్రిల్2 : తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు -మిగతా 2 లో..

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

**అయిన వారి కోసం కార్మికుల పొట్ట కొడతారా?**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత**



హైదరాబాద్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన -మిగతా 2 లో..




## చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

**కొందురు కావాలనే తప్పదోవ పట్టిస్తున్నారు**

**బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ వెల్లడి**

## కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

**కేసీఆర్ ఇష్టానుసారంగా కాళేశ్వరం నిర్మాణం**

ఏటిఎంలా ప్రాజెక్టు వాడుకున్న కేసీఆర్

ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కేసీఆర్

అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్

రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు.


06

రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై

## అతి భీకర దాడులు

**హర్మూజ్ అవసరం లేదు**

**ట్రంప్ కీలక ప్రకటన**


06

## ఇరాన్ పునర్నిర్మాణానికి నడుం బిగించండి : మొజ్తాబా



## నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

**పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక**

**మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పన కేటాయించారు.

రంగారెడ్డి, ఏప్రిల్ 2 : చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ పక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ -మిగతా 2 లో..



## కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

**పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు**

సంగారెడ్డి,ఏప్రిల్2 : కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ -మిగతా 2 లో..

## అమరావతికి సంపూర్ణ మద్దతు

**కాళేశ్వరం ప్రాజెక్టుకు పైసా ఇవ్వకున్నా కట్టాము**

**తెలంగాణకు 12 ఏళ్లుగా సాయం చేయని కేంద్రం**

**రాజ్యసభలో వద్దిరాజు, కెఆర్ సురేశ్ రెడ్డి**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 : రాజధాని అమరావతికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. అమరావతి బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు రుణాలతో కాళేశ్వరం కట్టామని వివరించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా కాళేశ్వరం నిర్మించామని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంపై కేంద్ర -మిగతా 2 లో..



## ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

**అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు**



హైదరాబాద్, ఏప్రిల్ 2 : ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా -మిగతా 2 లో..



## ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్2 : కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 :** రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అమరావతికి మా సంపూర్ణ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతికి గతంలోనే కేసీఆర్ మద్దతు తెలిపారన్నారు. అమరుల త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలబెట్టామన్నారు. ప్రాంతాల వారీగా వేరైనా అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారని వెల్లడించారు. కనీసం చర్చ లేకుండా 7 మండలాలను ఏపీలో కలిపారని.. విభజన తీరుపై బీజేపీ తరచూ విమర్శలు చేస్తోందని అన్నారు. తల్లిని చంపి బిడ్డను తీశారన్నట్లు మాట్లాడారని సురేశ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం అంటే ఒక డ్యాం.. ప్రాజెక్ట్ మాత్రమే కాదని ఎంపీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని తెలిపారు. పైసా ఇవ్వకపోయినా కాళేశ్వరం కట్టామన్నారు. అయినా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ రూ.లక్ష కోట్లు పోయాయని మాట్లాడారని చెప్పారు. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని.. తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి పాటిల్ క్షమాపణ చెప్పాలని ఎంపీ సురేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో కూలిన రెండు పిల్లర్లను 300 కోట్లతో బాగు చేయవచ్చన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

(మొదటిపేజీ తరువాయి)



విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత

# ట్రాఫిక్ ట్రాఫిక్ రద్దీపై పోలీసుల సర్వే

**వ్యక్తిగత వాహనాల వల్లనే రద్దీ**

**గ్రూప్ ప్రయాణాలతో రద్దీ తగ్గుతుందని వెల్లడి**




**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృథా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసినప్పటికీ, అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడానికే మొగ్గు చూపడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ–ఎ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్ హెచ్‌ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఐటీ ఉద్యోగులు, సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పార్లమెంట్ సాక్షిగా అబద్దాలు

- ఏడు మండలాల అప్పగింత బిజెపి పుణ్యమే
- వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపి చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యనించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్దం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీష్‌రావు విమరించారు. 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025–26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కిషన్ రెడ్డి తెలిపారు.



# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

# చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

**హైదరాబాద్,ఏప్రిల్2 :** చికెన్ రేటు మార్జిన్ విషయంలో చికెన్ రిటైల్ షాపు వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ తెలిపింది. రిటైల్ షాపుల ఆరోపణలపై హైదరాబాద్ సోమాజిగూడాలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు రామిరెడ్డి , బాలసుబ్రహ్మణ్యన్ , రాజిరెడ్డి లు మాట్లాడారు. చికెన్ లైవ్ రేట్ తో పాటు రిటైల్ ధరలను పేపర్ ద్వారా ప్రకటనలు ఇస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా కిలోకు 40 రూపాయలు మార్జిన్ ఇస్తున్నామని , కరోనా సమయంలో కూడా అంతే ఇచ్చామని తెలిపారు. బంద్ లో ఉన్న వ్యాపారులు కిలోకు 30 రూపాయలు అడుగుతున్నారని... తాము 40 ఇస్తున్నామన్నారు. కొందరు కావాలనే వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కంపెనీలు నష్టాల్లో ఉన్నా కస్టమర్ పై భారం పడకుండా రేటును నిర్ణయిస్తున్నామని తెలిపారు. రిటైల్ వ్యాపారులతో తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, వారికి వస్తున్న మార్జిన్ పై వివరించి చెబుతామని అన్నారు. మరోవైపు చికెన్ పై మార్జిన్ పెంచి, న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ చేస్తున్న బంద్ రెండో రోజుకు చేరుకుంది. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రకటిస్తున్న రిటైల్ అసోసియేష్ సభ్యులు.. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ పెంచేవరకూ నిరవధిక బంద్పాటిస్తా మని హెచ్చరించింది. చికెన్ పై మార్జిన్ ఇవ్వకపోవడం పౌల్ట్రీ కంపెనీల తీరుకు నిరసనగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, గోపి, యాదగిరి, వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల 26 శాతం ఉన్న మార్జిన్ ను పౌల్ట్రీ కంపెనీలు16 శాతానికి తగ్గించాయని, దీనివల్ల చికెన్ షాపుల నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

(మొదటిపేజీ తరువాయి)



రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం 40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి థియేటర్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న ప్రీమియం థియేటర్లని, వాటిలో ప్రేక్షకులకు అన్ని సౌకర్యాలున్నాయని, అయితే ఈ థియేటర్ల నిర్వహణకు చాలా ఖర్చవుతోందన్నారు. ప్రస్తుత అద్దె విధానంతో వారు మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శిస్తామన్న తమ ప్రపోజల్‌ను డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారని చెప్పారు. శశిధర్ రెడ్డి మాత్రమే నిర్మాతలు, ఇతర భాగస్వాములతో మరింత చర్చించి, ఆ తర్వాత అభిప్రాయం చెబుతామన్నారని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో సినిమాలను కేవలం శాతం ప్రాతిపదికనే ప్రదర్శిస్తామని, ఇది విడతల వారీగా జరుగుతుందని ఎగ్జిబిటర్లు తెలిపారని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటనలో పేర్కొంది. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశం లోనూ దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల సింగిల్ స్క్రీన్‌లు పర్సంటేజీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తున్నాయి. సింగిల్ స్క్రీన్‌ల మనుగడ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని డిస్ట్రిబ్యూటర్లు, సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. రెంటల్ విధానానికి బదులు పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన కోసం ఎప్పటి నుంచో ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 23 థియేటర్ల యాజమాన్యాలు ముందడుగు వేశాయి.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

## సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి. సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్ధతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన– ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

## సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**రంగారెడ్డి, ఏప్రిల్ 2 :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాష్ట్రప్రజలకు కేసీఆర్ హనుమత్ జయంతి శుభాకాక్షలు



**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారామచంద్ర మూర్తి భక్తుడుగా, బలం, జ్ఞానం, వాక్చాతుర్యం అన్నీకలిసి, అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానిగా, హిందూ పురాణాలు హనుమంతుడిని కీర్తిస్తాయని కేసీఆర్ తెలిపారు. సంత్ తులసీ దాస్ తన రామచరిత మానస్‌లో చెప్పినట్టు అంజనీ సుతుడు జ్ఞానినాం అగ్రగణ్యం., అంటే జ్ఞానుల్లో అత్యున్నతుడు..అని కేసీఆర్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణం లో శ్రీరాముడు అన్నట్టు 'న వాక్యదోషం నచ అపశబ్దం'..అంటే., ఎటువంటి దోషాలు లేని భాషతో, ఉచ్చారణతో, వ్యాకరణం మీద పట్టుతో వాక్ శుద్ధితో ప్రసంగించే గొప్ప వక్త హనుమంతుడు అని కేసీఆర్ కొనియాడారు. ధర్మరక్షణ కోసం, తాను నమ్మిన శ్రీ రామునికి తన శక్తినంతా ధారపోసి, ఎటువంటి ప్రతి ఫలాపేక్ష లేకుండా, ప్రజా సంక్షేమం కోసం నాయకత్వాన్ని తన భుజాలమీద మోసిన బలశాలి, వినయానికి ,విజయానికి మార్గదర్శి, మృదుస్వభావి శ్రీ ఆంజనేయ స్వామి అని కేసీఆర్ కొనియాడారు. జ్ఞానం వాక్చాతుర్యం బలం భక్తి వినయం అన్నీ కలెగలిసిన సంపూర్ణ వ్యక్తిత్వం హనుమంతుడికే సాధ్యం అన్నారు. వారి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరానికి ఆచరణీయమని కేసీఆర్ తెలిపారు. ఆదర్శవంతమైన ఆలోచనలతో, దూరదృష్టితో, తమ జీవితాలను తీర్చిదిద్దుకునే శక్తిని హనుమంతుడు రాష్ట్ర ప్రజలకు అందించాలని, ప్రగతి తిరిగి పుంజుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

## పెళ్లి చేసుకున్న నెలకే నవ వధువు ఆత్మహత్య

### కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవవధువు ఆత్మహత్య కలకలం రేపుతోంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల రోజులకే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. 2020లో సోషల్ మీడియా ద్వారా బీహార్‌కు చెందిన ఇషికా యాదవ్, మధ్యప్రదేశ్‌కు చెందిన నీరాజ్ బన్సల్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మార దంతో ఫిబ్రవరి 20న పెద్దల సమక్షంలో ఇరువురూ వివాహం చేసుకున్నారు. మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్‌లోనీ ఓ అపార్ట్‌మెంట్‌లో ఇషిక, నీరజ్ నివాసముంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ భార్యాభర్తలు ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా అదనపు కట్నం విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. భర్త వేధింపులు తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఇషిక ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారంతో మియాపూర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సైబర్ నేరాల కేసు మరో కీలక మలుపు

### మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగుల అరెస్ట్

**ఖమ్మం, ఏప్రిల్ 2 :** సత్తుపల్లి సైబర్ నేరాల కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ కేసులో సీఆర్‌వోలు ఓర్సు కృప, మంద శ్రీహరిబాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సత్తుపల్లి సీఐ శ్రీహరి అరెస్టు చేశారు. ఈ కేసులో ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, చంద్రుగొండకు చెందిన బ్యాంక్ మేనేజర్ అఖిల్ అబ్దుల్ ఇప్పటికే అరెస్టయిన సంగతి తెలిసిందే. అయితే, విచారణ సందర్భంగా తాజాగా అరెస్టయిన ముగ్గురు నిందితులు వారికి సహకరించినట్లు తేలింది. ఈ మేరకు ఓర్సు కృప, మంద శ్రీహరి బాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సీఐ శ్రీహరి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. కాగా, రూ.549.95 కోట్లు దోచుకున్న కేసులో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులంతా అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో చేతులు కలిపినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులు, బెట్టింగ్, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, క్రిటో కరెన్సీ వంటి మోసాలకు నిందితులు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి 24 మందిపై కేసు నమోదు కాగా ఇప్పటికే చాలా మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

## యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** మైలార్‌దేవ్‌పల్లిలో గంజాయి గ్యాంగ్ ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. స్థానికంగా ఉంటున్న వారి పట్ల ఈ గ్యాంగ్ అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజాగా మరోసారి రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్ ఓ యువకుడిపై విచాక్షణారహితంగా దాడి చేసింది. శాస్త్రీపురంలో ఫహాద్ అనే యువకుడిపై కత్తులు, రాడ్స్‌తో దాడి చేసింది గంజాయి బ్యాచ్. తీవ్రంగా గాయపడిన ఫహాద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఫహాద్‌పై ఈ గ్యాంగ్ దాడి చేసినట్లు తెలుస్తోంది. షానవాజ్, షాబాజ్‌తో పాటు మరో ముగ్గురు దాడి చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో యువకుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

# అమరావతికి ఆమోదముద్ర

### రాజ్యసభలోనూ ఏకగ్రీవం
### బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
### రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రైవేటీకరణ కుట్రల నుంచి బయటపడని స్టీల్ ప్లాంట్

### నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నిరసన

**విశాఖపట్టణం, ఏప్రిల్ 2 :** ప్రభుత్వ రంగంలోని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమ చూపిస్తున్నాయని, ప్రైవేట్ రంగం పట్ల ప్రేమ చూపిస్తూ, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మిక,ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ, ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెఎసి ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మిక ప్రజా సంఘాలు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవన్నారు. జి ఎస్ టి రాయితీలు లేవన్నారు. వాటర్ రాయితీ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ లో తొమ్మిది వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, స్టీల్ ప్లాంట్ పై సుమారు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాల పాటు లాభాలలో నడిచిన స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నిర్ణయించిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ, కార్మికులు ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇదే సందర్భంలో అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆర్ సి ఎల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రా మెటీరియల్ గ్యారెంటీ ఇచ్చాయన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ చెల్లించిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల వరకు వాటర్ పై పన్ను లేదన్నారు. 15 సంవత్సరాల పాటు పూర్తి రాయితీ ఎలక్ట్రిసిటీ కల్పిస్తున్నారు. 2.9 కిలోమీటర్ల వరకు క్యాపిటల్ పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. ప్రైవేటు మిట్టల్ పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ రంగం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మార్చుకొని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ టియు జాతీయ అధ్యక్షుడు ఎన్. కనకరావు, సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగా రావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, అధ్యక్షులు కె.ఎం శ్రీనివాస్,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుత్ రావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,స్టీల్ ఎ÷–లాంట్ సిఐటియు యూనియన్ నాయకులు అయోధ్య రామ్,ఎన్.రామస్వామి,ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం,ఐఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,వైఎస్ఆర్ టియుసి యూనియన్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల కేసులో పోలీసుల దూకుడు

### పేదల నుంచి డబ్బు వసూళ్లు చేసిన ఏడుగురి అరెస్ట్

**ఖమ్మం, ఏప్రిల్ 2 :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల పేరుతో పేదలను దోచుకున్నారంటూ ఏడుగురిని ఖమ్మం పోలీసులు అరెస్టు చేశారు. భూములు ఇప్పిస్తామంటూ నిరుపేదలను లక్షల్లో మోసం చేశారంటూ బల్లి శ్రీనివాస్, పోలెబోయిన ముత్తయ్య, కొప్పెర వెంకన్న, తాళ్లూరి కృష్ణ, కుంజా కృష్ణయ్య, కల్తీ రామచంద్రయ్య, బాణాల లక్ష్మణాచారిని అరెస్టు చేశారు. నిరుపేదల నుంచి ఆ దళారీలు దోచుకున్న డబ్బును రికవరీ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నగదు వసూళ్లకు పాల్పడిన వారంతా ఆ సొమ్ముతో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వాహనాలు, ఇతర ఆస్తులు కొనుగోలు చేసినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేకునేందుకు చట్టపరమైన చర్యలను అధికారులు చేపట్టారు. భూదాన్ భూములు ఇప్పిస్తామంటూ మొత్తం 1,549 మంది నిరుపేదలను దళారీలు మోసగించినట్లుగా పోలీసులు గుర్తించారు. ఆ నగదు రికవరీ చేసి బాధితులకు ఇప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా, ఇటీవల వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారం తెలంగాణలో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. రాత్రికి రాత్రే భారీ వాహనాలతో వందల ఇళ్లను కూలగొట్టారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ మేరకు అక్కడ పలుమార్లు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే, భూదాన్ భూములను పలువురు ఆక్రమించారని స్థానిక మంత్రులు ఆరోపించారు. నిజమైన లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు చెప్పిన విధంగానే పలువురు లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. అయితే, భూదాన్ భూములను ఇప్పిస్తామని చెప్పి గతంలో పేదల నుంచి నిందితులు లక్షల వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

**సంగారెడ్డి, ఏప్రిల్ 2 :** ఆర్‌సీ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు.

## 10మంది గంజాయి బ్యాచ్ అరెస్ట్

**కరీంనగర్, ఏప్రిల్ 2 :** గంజాయి వినియోగంపై నార్కోటిక్స్ ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం బిగిస్తున్నారు. వరుస రైడ్లతో గంజాయి స్మగ్లర్లకు నిద్రలేకుండా చేస్తున్న పోలీసులు.. గురువారం కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. ప్రాంతీయ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్, స్థానిక పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో 10 మంది గంజాయి వినియోగదారులు పట్టుబడ్డారు. నిందితులకు నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.



## దోమతెర కప్పకుని ఎమ్మెల్యే నిరసన

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** నగరంలో దోమల సమస్యను ప్రభుత్వానికి తెలియచేసేందుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్నంగా రంగంలోకి దిగారు. దోమల బాధకు వ్యతిరేకంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దోమ తెర ధరించి, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీ వద్దకు వచ్చారు. అనుమతి లేదని ఎమ్మెల్యేను మార్షల్స్ అడ్డుకున్నారు. ఆయన వద్ద నుంచి దోమ తెర లాక్కునేందుకు యత్నించారు. దీంతో మార్షల్స్‌పై సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగని సమయంలో కొత్త నిబంధనలు ఎక్కడివని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దోమల తీవ్రతకు ప్రజలు హైదరాబాద్ నుంచి పారిపోతున్నారని వ్యాఖ్యానించారు. దీనివల్ల నగరం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని చెప్పారు. దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.



## అమరావతి విజయం రైతులదే

- అధికారంలోకి రాగానే నాలుక మడతేసిన జగన్
- 3రాజధానులంటూ రైతులకు హింసలు :మంత్రి లోకేశ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్2 :** ఎన్నికలకు ముందు ఏకైక రాజధాని అమరావతి అని చెప్పిన జగన్.. గెలిచిన ఆర్నెళ్లలో మూడు రాజధానుల పేరిట డ్రామా చేశారని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ప్రపంచంలో మూడు రాజధానుల విధానం ఎక్కడా విజయవంతం కాలేదని చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలంతా కలిసి హైదరాబాద్‌ను నిర్మించుకున్నారని, అయితే, రాజధాని లేకుండా ఏపీని విభజించారని అన్నారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని అమరావతిని ఎంపిక చేశామని, 2014లో వైకాపా సహా అన్ని పార్టీలు దీనికి అంగీకరించాయన్నారు. రాజధాని కోసం 58 రోజుల్లో 35 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను, మహిళలను దారుణంగా హింసించారు. రైతులు 1,600 రోజులకుపైగా పోరాడారు. ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని గత ఎన్నికల్లో మళ్లీ చెప్పాం. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ప్రజలు విజయం కట్టబెట్టారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విశాఖ ఎంపీ గెలిచారు. జగన్ చెప్పిన ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌లోనే మా ఎంపీ గెలిచారు. ప్రజలంతా అమరావతే ఏకైక రాజధాని అని మద్దతు పలికారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. బిల్లుకు ఒక్క పార్టీ మినహా అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ విజయం అమరావతి రైతులదే అని లోకేశ్ అన్నారు.

## సంపాదకీయం

# జగన్.. చపలచిత్త రాజకీయాలు!



**ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు.**

ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్–బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్–బీ కింద మచిలీపట్నం (మా) –విజయ వాడ (వి)–గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొ చ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చ న్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకో వచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం– విజయవాడ– గుం టూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు.

ఇష్టం వచ్చి నట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుంద నుకోవాలా అని అన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పు కోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్ర ప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతి రేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతి లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమా నం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు.

ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశ పరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫ్యూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# చికెన్ సెంటర్ల బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

### డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి

**వరంగల్, ఏప్రిల్ 2 :** చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకం దారులు వీటిని మార్కెట్‌కు తరలించారు. సాధారణ ధరకన్నా కాస్త ఎక్కువైనా కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్టు మాంసం విక్రయదారులు తెలిపారు. బుధవారం నుంచి చికెన్ సెంటర్ల బంద్ జరుగుతున్న దృష్ట్యా ముందే మేల్కొన్న మాంసం విక్రయదారులు కాస్త ఎక్కువగానే జీవాలను కోసి ఉదయం నుంచే సిద్ధంగా ఉంచారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసు కోవాలని, విధాన పరంగా చికెన్ ధరలు, కమీషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని పౌల్ట్రీ కంపెనీలు చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.




# అమరావతికి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### ప్రధాని మోడీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 :** అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.



# బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

### ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య
### చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు

**నారాయణపేట, ఏప్రిల్ 2 :** జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డి పల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్ధరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామస్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

# వేసవిలో పశుసంరక్షణ మార్గదర్శకాలు పాటించాలి

### పశుపోషక శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచనలు

**విజయవాడ, ఏప్రిల్ 2 :** వేసవికాలంలో సంభవించే ఈదురుగాలులు గ్రీష్మతాపం వడగాలులు వలన పశువుల ఆరోగ్యం క్షీణిస్తుందని ఇది వాటి మరణాలకు దారితీయవచ్చునని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు సూచించారు. అప్పుడు పశువులను కాపాడడానికి పశుసంవర్ధక క్షేత్రస్థాయి సిబ్బంది సూచనలు పశుపోషకులు తూచా తప్పకుండా పాటిస్తే పశువుల్లో వృద్ధి రేట్ పెరిగి పశుసమృద్ధి జరుగుతుందని వాటి ఉత్పత్తి సామర్థ్యం సైతం రెట్టింపు అవుతుందని అన్నారు. పశువుల యాజమాన్యం అనేది ఎలా ఉండాలి అనే అంశంపై గురువారం పశుసంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బందికి మరియు పశుపోషకులకు అయన సూచనలు జారీ చేశారు. పశుపోషకులు క్షేత్ర స్థాయి సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఈ విషయంలో పశు సంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బంది ఎల్లవేళలా జారీ చేసే సూచనలు పాటించి మేలైన పశువుల యాజమాన్యం సాధించాలని ఆయన తెలిపారు. శువులకు పరిశుభ్రమైన నీటి తొ÷–టటెలలో చల్లని తాజా అయిన మంచినీరు ఉదయం తెల్లవారుజామునే అందేవిధంగా జాగ్రత్తలు పాటించి పనిచేయాలని పశుపోషకులకు సూచించారు. ÷ూమూహిక నీటి తొ÷–టటెలను ఏర్పాటు చేయాలి. ఈ అంశాన్ని పంచాయతీరాజ్ సిబ్బందికి తెలపాలన్నారు. ఎక్కువుగా పశువులు సంచరించే ప్రదేశాలను గుర్తించి అక్కడ నీటి తొ÷–టటెలు ప్రణాళిక ప్రకారం పెట్టాలన్నారు. పశువుల యాజమాన్యంలో పంచాయతీ గ్రామీణ నీటిపారుదల శాఖలు అనుసంధానంతో పని చేయాలన్నారు. నీటి తొట్టెల ఏర్పాటులో స్వచ్ఛంద సేవాసంస్థలు దాతల సహకారం తీసుకుంటే ఎక్కువ మేలు జరుగుతుందని చెప్పారు. శువులకు మేతను చిన్న చిన్న ముక్కలుగా చేసి అందించాలి. ఎండ తక్కువుగా ఉన్నప్పుడు మేతను తినిపించు కోవాలి. పశువుల మేత యాజమాన్యం పాటించడం వలన పశువుల్లో జీర్ణశక్తి అభివృద్ధి జరిగి రోగనిరోధకం పశువులు సాధిస్తాయని అప్పుడు ఎక్కువ ఉత్పత్తులు పశువుల ద్వారా పొందవచ్చన్నారు. మేతలో ఖనిజాలు లవణాల మిశ్రమాలు ఎక్కువుగా ఉండాలన్నారు.

# క్యాటరింగ్ పేరుతో కంత్రీ పనులు

### ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** చేసేది క్యాటరింగ్ పనే ఐనా.. చాటుమాటుగా కంత్రీ పనులు చేస్తున్నాడో కేటుగాడు. ఫంక్షన్లకు క్యాటరింగ్ ఫుడ్ సప్లై చేస్తూ.. ముందుగా మాట్లాడుకున్న దాని కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఎందుకుని ప్రశ్నిస్తే ఫంక్షన్లో దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి వేధిస్తున్నాడు. సికింద్రాబాద్ అడ్డాగా క్యాటరింగ్ చాటున కంత్రీ పనులకు పాల్పడుతున్న కేటుగాడిని పోలీసులు పట్టుకున్నారు. సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్‌కి చెందిన వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ స్థానికంగా క్యాటరింగ్ బిజినెస్ చేస్తున్నాడు. మీటింగ్‌లు, ఫంక్షన్లకు ఫుడ్ సప్లై చేయడమే కాకుండా, వడ్డించేందుకు క్యాటరింగ్ బాయ్స్‌ను కూడా సప్లై చేస్తుంటాడు. మోండా మార్కెట్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్ కోసం అంజి కిరణ్ వద్ద క్యాటరింగ్ ఆర్డర్ ఇచ్చాడు. ఆర్డర్ బుకింగ్ సమయంలోనే ప్లేట్ భోజనానికి ఎంత ఛార్జ్ అవుతుంది? ఎన్ని ప్లేట్లు తెస్తారు? ఎంతమంది క్యాటరింగ్ బాయ్స్ వస్తారు? వాళ్లకు ఎంత ఇవ్వాలి? అనేది మాట్లాడుకున్నారు. తీరా ఫంక్షన్ ముగిసిన తర్వాత అంజి కిరణ్ అదనంగా బిల్లు వేశాడు. ఏవేవో ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఎందుకు ఇవ్వాలి అని అడిగితే గొడవ పెట్టుకున్నాడు. అసభ్యంగా దూషించాడు. ఫంక్షన్ జరుగుతున్న సమయంలో ఫంక్షన్‌కి అటెండ్ అయిన మహిళల ఫొటోలు తీశానని? వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిలింగ్‌కి దిగాడు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. అంజి కిరణ్‌పై ఫిర్యాదు చేశారు. వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పోలీసులు. ఇదే తరహాలో పలుచోట్ల బెదిరింపులకు, వేధింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినట్లు గుర్తించారు పోలీసులు. గతంలో ఇలాంటివే రెండు కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. అంజి కిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# జగన్‌కు గౌరవం ఉంటే క్షమాపణలు చెప్పేవారు

### మావిగన్ పేరుతో మళ్లీ రాజకీయ డ్రామాలు
### మండిపడ్డ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

**గుంటూరు, ఏప్రిల్ 2 :** జగన్.. ప్రజాభిప్రాయానికి గౌరవం ఇచ్చే రాజకీయ నాయకుడైతే అమరావతి ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పేవారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఇష్టం వచ్చినట్లు వ్యంగ్యంగా మావిగన్ అంటున్నారని విమర్శించారు. మూడురాజధానిఉలు పోయి, ఇప్పుడు మావిగన్ పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధానిగా అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని.. గతంలో జగన్ కూడా అసెంబ్లీలో ఒప్పుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో అమరావతే రాజధాని జగన్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాటాడి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. వైజాగ్‌ను జగన్ సర్వనాశనం చేశారని.. ఉత్తరాంధ్ర ప్రజలు బెంబేలెత్తిపోయారన్నారు. 2024లో ఎన్డీయే కూటమికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కర్నూలులో హైకోర్ట్ ఏర్పాటుకు గత ప్రభుత్వ పాలనలో తీర్మానం చేశారా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చట్టం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ ఇస్తారని తెలిపారు. అమరావతి నుంచి పూచిక పుల్ల కూడా కదిలించలేరని ఆనాడే చెప్పానని తెలిపారు.

# వాడపల్లిలో వైభవంగా ఉత్సవాలు

### భారీగా హాజరైన భక్తులు

**కోనసీమ, ఏప్రిల్ 2 :** కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా తెప్పోత్సవం కొనసాగింది. విశేష పూజలతో పాటు, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుల మేల్కొలుపుతో ప్రారంభమైన ఈ మహోత్సవంలో గౌతమి గోదావరి పవిత్ర జలాలను తెచ్చి స్వామివారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిత్యార్చన, నిత్య హోమాలు, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు అమ్మవార్లకు విశేష పూజారి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన హోమం అనంతరం స్వామివారిని సన్నాయి మేళాల నడుమ రాత్రి గౌతమి గోదావరి తీరం వైపు తీసుకెళ్లి, అంగరంగ వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నది మధ్యలో సాగిన ఈ తెప్పోత్సవం భక్తులకు కనుల విందుగా మారి, హృదయాలను భక్తి పరవశంలో ముంచెత్తింది. స్వామివారి కోసం ప్రత్యేకంగా విద్యుత్ పూల అలంకరణలతో రూపొందించిన తెప్ప అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గోదారమ్మ ఒడిలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది. ఈ పవిత్ర వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా విశేషమైన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శనలు, కళా ప్రదర్శనలు, కోలాటాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలు నుంచే కాకుండా సుధీర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఈ కార్యక్రమాలు ఆనందాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో పాటు భక్తిని కూడా పెంపొందించాయి. భక్తుల గోవింద నామస్మరణల ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

# ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్
- ప్రభుత్వ పథకాలను అందరికీ తెలియజేయాలని సూచన



**మేడ్చల్, జనం వార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజల ఆకాంక్షలు, అవసరాలకనుగుణంగా అభివృద్ధి పథంలో నడిపేలా నూతన పథకాలను ఏర్పాటు చేస్తూ ఎంతో ఆర్థిక చేయూతను ఇస్తున్నదనీ, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ప్రజా పాలన – ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఆలియాబాదు, ఎల్లంపేట మున్సిపాలిటిలలో నిర్వహించిన వార్డు సభలకు మున్సిపల్ ఛైర్మన్లు శిరీషరెడ్డి, శ్రీదేవి లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా,మహాలక్ష్మి, ఉచిత బస్సుసౌకర్యం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారికి మరిన్ని కొత్త పథకాలను అందించాలనే సంకల్పంతో గ్రామ సభలను నిర్వహించుకుంటున్నామన్నారు. జూన్ 2 నుంచి అందరికీ 1. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, 2. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందించడం, 3. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు, 4.దివ్యాంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి కొత్త పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుంన్నదన్నారు. గ్రామ, వార్డు సభలలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రాథాన్యత క్రమంలో చర్యలు చేపడతామన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు, ప్రభుత్వ పథకాల గురించి తెలియని వారికి తెలియజేయాలన్నారు. వారు కూడా ఈ పథకాలను వినియోగించుకునేలా చూడాలన్నారు. దేశం మొత్తం లో కేవలం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళల ప్రయాణం కోసం మహాలక్ష్మి ఇలాంటి పథకాలు అమలులో ఉన్నాయని, వీటిని మహిళలు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్ కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత గల ప్రతి ఇంటికి చేరడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని అందులో భాగంగానే గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేసి ప్రజలను భాగస్వాములను చేయడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమన్నారు. అంతకు ముందు సభలో ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి వీడియోలను ప్రదర్శించడంతో పాటు సాంస్కృతిక కళాకారులు సంక్షేమ పథకాల పై పాటలు పాడి వినిపించారు. అనంతరం లబ్దిదారులు వారి సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్నవించుకోగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారాన్ని సత్వరమే పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటున్న లబ్దిదారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు, వైస్ ఛైర్మన్లు, సంబంధిత తహాసీల్దార్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



## నాగారంలో ఘనంగా హనుమాన్ జయంతి

### శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నాగారం, ఏప్రిల్ 2 (జనం వార్త) :** రామభక్త హనుమాన్ శుభాశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.నాగారం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభయాత్ర కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ శోభయాత్రలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులుగౌడ్, జగన్మోహన్ రెడ్డి,కొామి రెల్లి సుధాకర్ రెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్, జూపల్లి నరేష్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్,సూర్య శేఖర్ రెడ్డి, అక్కాల సురేష్,నక్క కిషోర్ గౌడ్,బిజెపి నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పచ్చని చెట్లు ప్రగతి మెట్లు

### డీసీ చాముండేశ్వరి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 2 (జనం వార్త) :** మనిషి నివసించే పరిసరాలలో పచ్చని చెట్లను పెంచితే అవి మనిషి మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి అన్నారు. గురువారం సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ సమీపంలో రాజన్న టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీసీ చాముండేశ్వరి మాట్లాడుతూ కాలుష్య రహిత వాతావరణం కోసం మొక్కలను పెంచాలని సూచించారు. నాటిన చెట్లు ఎండిపోకుండా కాపాడాలని స్థానికులకు సూచించారు. ఎల్లమ్మ బండలో నెలకొన్న పలు సమస్యలను రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి డిసి దృష్టికి తీసుకెళ్లారు. రాజన్న టీమ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ బండలో చేపడుతున్న పలు కార్యక్రమాలను డీసీకి వివరించారు. ఈ సందర్భంగా రాజన్న టీమ్ సభ్యులను డిసి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, బాబు, రాజు, అరుణ్, ఉప్పల రాజు, హరీష్, శివ, లింగన్న, సుమన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

### నివాళులర్పించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్

**మేడ్చల్, జనం వార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు సర్దార్ సర్వాయీ పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ (లోకల్ బాడీ) జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ సర్వాయీ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీ రాణి,డి.ఎస్.ఓ శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఝాన్సీ రాణి మాట్లాడుతూ, ఈ నెల 3న శుక్రవారం ఉదయం 10 గంటలకు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్నామని, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, బి.సి. సంఘం నాయకులు, కురుమ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


## ఎస్సీ కార్పోరేషన్ రుణాలకు గడువు పొడిగింపు

**మేడ్చల్, జనం వార్త:** షెడ్యూలు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, ఎస్.సి. యాక్షన్ ప్లాన్ సవరించిన పథకాల కింద ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో ప్యాసింజర్, గూడ్స్ వాహనాలు, సోలార్ యూనివర్సల్ సంప్ కం(టోల్, (2) బర్రెలు మొదలైన పథకాలతో లోన్లు ప్రకటించడం జరిగింది. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కు చివరి గడువు ఏప్రిల్ 2 నుంచి 8 వరకు పొడిగించడం జరిగింది.అర్హత, ఆసక్తికల షెడ్యూలు కులాల అభ్యర్థులు టి.జీ.ఓ.బి.ఎం.ఎం.ఎస్ ఆన్లైన్ పోర్టల్ https://tsobmms ఎఎం.సి.ఆర్.వి జి.ఓ.వి.ఇన్ ద్వారా దరఖాస్తులు ఈ నెల 8 వరకు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కొరకు జిల్లాలోని ఎస్.సి. కార్పోరేషన్ కార్యాలయం, మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా, రూమ్ నెం.5–16,ప్రాష్ట.చీశీ 040–24020610, రెండవ అంతస్తులో సంప్రదించవచ్చని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు మోజెస్ సూచించారు.

## కోట మైసమ్మ దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించిన గూడూరు పెంటయ్య గౌడ్

- ఆలయ గోపురం పనులు శరవేగం
- ఆలయ నిర్మాణ పనులు శ్రద్ధగా చేయాలి:గూడూరు మహేష్ గౌడ్

**నాగారం,ఏప్రిల్ 2(జనం వార్త) :** శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ గౌరవ అధ్యక్షులు గూడూరు పెంటయ్య గౌడ్ స్వంత నిధులతో చేపట్టిన కోట మైసమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాగారం డివిజన్ పరిధిలో






శరవేగంగా కొనసాగుతున్న కోట మైసమ్మ ఆలయ నిర్మాణ పనులను గూడూరు పెంటయ్య గౌడ్ తన కుమారుడు గూడూరు మహేష్ గౌడ్ తో కలిసి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ కోట మైసమ్మ తల్లి చల్లని దీవెనలతో గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే అమ్మవారి దయతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ గోపురం పనులను భక్తిశ్రద్ధలతో చేయాలని గూడూరు మహేష్ గౌడ్ శిల్పకారులకు సూచించారు.

## గ్రామసభలో వెల్లువెత్తిన సమస్యలు



**కారేపల్లి, జనం వార్త:** మండలంలోని గుంపెళ్ళ గూడెం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన––99 రోజుల ప్రణాళిక గ్రామసభ సజావుగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గూగులోత్ కృష్ణవేణి, ఉప సర్పంచ్ భూక్యా శంకర్, గ్రామ సెక్రటరీ, వార్డు సభ్యులు హాజరై గ్రామాభివృద్ధిపై సమగ్రంగా చర్చించారు. గ్రామసభలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మౌలిక వసతుల కొరత, తాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం వంటి అంశాలపై గ్రామస్థులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ కృష్ణవేణి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు సూచించిన ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిగణలోకి తీసుకుని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం, వాటికి సరైన పరిష్కార మార్గాలను రూపొందించడం కోసం గ్రామసభలు కీలకంగా మారుతున్నాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. చివరగా గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్‌కు 74 మందితో జంబో కార్యవర్గం

- రాష్ట్ర కమిటికి ప్రతిపాదనలు పంపిన జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్
- ఆమోదం తెలిపిన రాష్ట్ర కమిటి

**మేడ్చల్, జనం వార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లాకు నూతన కార్యవర్గాన్ని నియామకం చేసింది. ఇందులో 74 మందికి అవకాశం లభించింది. జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పంపిన నూతన కార్యవర్గం సభ్యుల పేర్ల ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీ ఆమోదిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో నూతన జిల్లా కార్యవర్గం ఖరారైంది. ఇందులో, జిల్లా ఉపాధ్యక్షులుగా వేముల మహేష్ గౌడ్, బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, ధన్పాల్, కూన శ్రీనివాస్ గౌడ్, ఏ. ముత్యంరెడ్డి, బుయ్యాని శివకుమార్, రాఘవేందర్, శ్రీకాంత్ పటేల్ గౌడ్, విగ్నేశ్వర్ రెడ్డి, జంగాల శ్రీరామ్, ప్రధాన కార్యదర్శులుగా ఏనుగు జలంధర్ రెడ్డి, ఇటికాల కృష్ణారెడ్డి, ముప్పా రామారావు, మహమ్మద్ అబ్దుల్ జలీల్ పాషా, కొంపల్లి బాలరాజ్, పాకాల రాజ్ కుమార్, చక్క సురేష్, రాము గౌడ్, పైడి ప్రశాంత్ గౌడ్, సోమనగారి శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జెమ్మి దేవేందర్, బంటు నరేష్, డి. అశోక్, విట్టల్ రెడ్డి, మచ్చా కిరణ్ గౌడ్, బొందిలి సురేష్ కుమార్ సింగ్, మౌనిక, భవిత, రావూరు మౌలేశ్వరరావు, ట్రెజరర్ గా ప్రొద్దుటూరు నర్సింగరావు గుప్తా, స్పోక్స్ పర్సన్ గా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, హల్లీరాజ్ మోహన్, గడ్డమీది భరత్ గౌడ్, ఏ. మధుమోహన్, కార్యదర్శులుగా వెంకట్ రెడ్డి, మామిడాల ముత్యాలు యాదవ్, బక్కని నర్సింగరావు, సదానందం, విష్ణు గౌడ్, నవీన్ రెడ్డి, షాహిన్ పాషా, మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, గండ్ల మురళి, పాసికంటి నాగరాజు, ఉదసాని రాంరెడ్డి, ఎం.డి.లాయక్, పండరి రావు, గణేష్ జాకీర్, సంతోష్, మోటె శ్రీనివాస్ యాదవ్, సీహెచ్ బుచ్చిరెడ్డి, బొబ్బరంగారావు, ఎండి హమీద్ ఖాన్, పి. శ్రీనివాస్ రెడ్డి, పాల్గునరావు, జోసెఫ్ మేఘనాథ్ అగస్టీన్, తుమ్మ రజినీకాంత్, వినయ్ కుమార్, ఎండి ముజఫరుద్దీన్, శకుంతల నాయుడు, పరమేష్, కుసుమ గాంధీ, కీర్తి గణేష్, దాసరి రాజేందర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్స్ మెంబర్లుగా దామన్నగిరి ప్రభాకర్ లక్ష్మీ చౌదరి, బాలప్ప, కరణ్, ఎర్వ వెంకట్, ఎల్లయ్య, శ్యాంసుందర్, పౌల్ బ్రహ్మయ్యలు ఎన్నికయ్యారు.



## బాధ్యతలు స్వీకరించిన టి.ఎన్.జీ.వో నూతన కేంద్ర కమిటి

**మేడ్చల్ జనం వార్త:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం కేంద్ర సంఘానికి నూతన కమిటీనీ ఎన్నుకుంది. ఈ కమిటీ గురువారం నాంపల్లి లోని టి. ఎన్.జీ. వో భవన్‌లో బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా మారం జగదీష్ కేంద్ర సంఘం అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం. హుసేని ముజీబ్ బాధ్యతలు స్వీకరించగా, అసోసియేట్ అధ్యక్షులుగా కస్తూరి వెంకట్, సత్యనారాయణ గౌడ్ లు నియమితులయ్యారు. కోశాధికారిగా శ్రీమతి ఉమాదేవి, ఉపాధ్యక్షులుగా సి.హెచ్ నరసింహ చారి, సిహెచ్ నరసింహారెడ్డి, డి. రాము, ఈ. కొండల్ రెడ్డిలు నియమితులయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా నిర్మల రాజకుమారి రాథోడ్ బాధ్యతలు చేపట్టారు. అలాగే, కార్యదర్శులుగా ఏ. తిరుమలరెడ్డి నజీర్ అహ్మద్, రాగి శ్రీనివాస్, శ్రీ పి. శ్రీనివాస్ లు నియమితులయ్యారు. మహిళా కార్యదర్శిగా శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జైపాల్ విజయ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా సర్దార్ హరివిందర్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా జి. అనురాధ, గీతారాణి, కే. సుభాష్ చంద్ర లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు, జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మెన్ బి. రవి ప్రకాశ్, అసోసియేట్ అధ్యక్షుడు స్యామ్యూల్ పాల్, జిల్లా కార్యదర్శి భారత్ కుమార్ లు నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జేమ్స్ దాస్, కలెక్టర్ యూనిట్ అధ్యక్షుడు కార్తిక్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వేముల మహేష్ గౌడ్

### ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**ఘట్ కేసర్, జనం వార్త:** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల నియామకాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఘట్కేసర్ మండలానికి చెందిన వేముల మహేష్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ ఉన్నత నాయకత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వేముల మహేష్ గౌడ్ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, గతంలో పలు బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని గుర్తించిన నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ హైకమాండ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, కార్యకర్తలతో సమన్వయం పెంచుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని అన్నారు. ఆయన నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మరింత ఊపుని తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.



## భాగ్యనగర్‌తండాలో గ్రామసభ

**కారేపల్లి, జనం వార్త:** తెలంగాణ రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధనతో పాటు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు చేరేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన––99 రోజుల ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి నూతన దిశను నిర్దేశిస్తూ, అభివృద్ధి పనులకు వేగం తీసుకువస్తోందని ఆయన పేర్కొన్నారు. భాగ్యనగర్ తండాలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ, ఈ ప్రత్యేక ప్రణాళిక ద్వారా గ్రామాల్లో తక్షణ అవసరాల గుర్తింపు, సమస్యల పరిష్కారం మరింత సమర్థవంతంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇరాన్ పునర్నిర్మాణానికి నడుం బిగించండి : మొజ్తాబా



**ఇరాన్ :** అమెరికా- ఇజ్రాయెల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మండిపడ్డారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన సందేశం విడుదల చేశారు. అమెరికా- ఇజ్రాయెల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా ఖండించారు. ఈ దాడుల కారణంగా ఇరాన్‌లో మౌలిక సదు-పాయాలతో పాటు పర్యావరణం కూడా దెబ్బతిందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం దేశ అంతర్గత అభివృద్ధిపై దృష్టిసారిం చాలని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధిని విస్తరించడం, ఇరాన్ ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌లోని మినాబ్ పాఠశాలపై జరిగిన దాడి గురించి మొజ్తాబా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఘటనలో 186 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరికి నివాళిగా పట్టణ, గ్రామీణప్రాంతాల్లో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యుద్ధంలో చనిపోయిన వారిని స్మరించుకుంటూ ఇరాన్ ప్రజలు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

### అమెరికా ప్రజలకు బహిరంగ లేఖ..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా ప్రజలను ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. తమకు అమెరికన్లపై ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టంచేశారు. అనేకసార్లు ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదురైనప్పటికీ.. తాము ఎన్నడూ యుద్ధానికి దిగలేదన్నారు. తమపై చేస్తోన్న దాడులను దృఢంగా, ధైర్యంగా తిప్పికొడుతున్నామన్నారు. 'అమెరికా ఫస్ట్' అనేది ప్రస్తుత పరిపాలనలో ఉందా అని ఆయన ప్రశ్నించారు.



# ఇరాన్‌తో యుద్ధం..

### ఒత్తిడిలో అమెరికా సైనికులు..?

**వాషింగ్టన్ :** నెల రోజులకు పైగా కొనసాగుతోన్న ఇరాన్ యుద్ధంతో అమెరికా సైనికులు ఒత్తిడికి గురవుతున్నారట. పశ్చిమాసియాలో మోహరింపులపై ఆందోళనగా ఉన్నారట. ఆ భయాల నుంచి బయటపడేందుకు, సేదదీరేందుకు భారీగా డబ్బులు వెచ్చిస్తున్నారంటూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విడుదల చేసిన ఓ వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. "సైనిక స్థావరాలకు సమీపంలో ఉన్న మా క్లబ్ వద్దకు భారీగా సైనికులు వస్తున్నారు. వారంతా ఒత్తిడిలో కనిపిస్తున్నారు. సేదదీరేందుకు భారీగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. వచ్చేవారం మేం వెళ్తున్నామంటూ యుద్ధం గురించి చెబుతున్నారు. వారిలో చాలా చిన్నవయసు వారున్నారు. వారిని చూస్తుంటే ఎంతో ఉద్వేగంగా అనిపించింది" అని ఆ ఇన్‌ఫ్లుయెన్సర్ వెల్లడించారు. పశ్చిమాసియాలో అమెరికా మోహరింపులు పెంచుతున్న వేళ ఈ వీడియో వెలుగులోకి వచ్చింది. ఇన్‌ఫ్లుయెన్సర్ వెల్లడించిన విషయాలను బట్టి.. ఈ ఘర్షణల కోసం భారీ సంఖ్యలో సైనికులను పంపుతున్నారా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. మోహరింపుల గురించి ఇలా బయటకు రావడాన్ని మాజీ సైనికాధికారులు ఖండిస్తున్నారు. క్లబ్బుల్లో జరిగే అనవసర సంభాషణలు శత్రువులకు కీలకమైన సమాచారాన్ని అందించే అవకాశం ఉందని హెచ్చరించారు.

# పాకిస్థాన్‌కు వీసా నిలిపివేసిన ఖతార్

**ఖతార్ :** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ పరిస్థితులు వివిధ దేశాల్లోని దౌత్య, రవాణా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న భీకర పోరు, దానికి అమెరికా మద్దతు ఇస్తున్న నేపథ్యంలో నెలకొన్న అస్థిరతను దృష్టిలో ఉంచుకుని ఖతార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ పౌరులకు ఇప్పటివరకు కల్పిస్తున్న 'వీసా ఆన్ అరైవల్' సౌకర్యాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. వీసా ఆన్ అరైవల్ అంటే ఒక దేశానికి వెళ్లాలనుకునే ప్రయాణికులు తమ స్వదేశంలోనే ముందస్తుగా వీసా కోసం దరఖాస్తు చేసుకోనవసరం లేదు. నేరుగా ఆ దేశానికి చేరుకున్న తర్వాత అక్కడి విమానాశ్రయంలోనో లేదా సరిహద్దు చెక్-పోస్ట్ వద్దనో వీసా పొందవచ్చు. ఈ తాజా పరిణామంపై దోహాలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా ఖతార్ ఈ నిర్ణయం తీసుకుందని, పాక్ పౌరులు దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. 'ప్రస్తుత పరిస్థితుల కారణంగా పాకిస్థాన్ పౌరులకు వీసా ఆన్ అరైవల్ సౌకర్యం అందుబాటులో లేదు. ప్రయాణికులు ఇబ్బందులకు గురికాకుండా ఉండాలంటే ముందస్తుగానే వీసాలు పొందాలి' అని పాక్ ఎంబసీ స్పష్టం చేసింది. ఖతార్ తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల తక్షణం పనుల నిమిత్తం వెళ్లే వ్యాపారులకు ఇది సమస్యగా మారుతంది. స్వల్పకాలిక ప్రాజెక్టుల కోసం వెళ్లే నిపుణులు, వీసా నిబంధనల సరళీకరణతో ఖతార్ వెళ్లాలనుకున్న సందర్శకులకు ఇది అవాంతరంగా మారుతుంది. కేవలం పాకిస్థానే కాకుండా లెబనాన్ పౌరులపై కూడా ఖతార్ ఇవే ఆంక్షలు విధించింది. లెబనాన్ నుంచి వచ్చే వారు ఇప్పుడు అధికారిక 'ఝఎఝ.ఝ' ప్లాట్‌ఫారమ్ ద్వారా ముందుగా వీసా పొంది దాని ప్రింటెడ్ కాపీని వెంట ఉంచుకోవడం తప్పనిసరి.

### ఎందుకీ నిర్ణయం


ఖతార్ ప్రభుత్వం పాకిస్థాన్, లెబనాన్ పౌరులకు వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని నిలిపివేయడం వెనుక ప్రధానంగా భద్రతా, దౌత్యపరమైన కారణాలు ఉన్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఖతార్ భౌగోళికంగా ఈ ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా ఉంది. దేశంలోకి ఎవరు వస్తున్నారు, ఎందుకు వస్తున్నారు అనే అంశంపై పూర్తి నియంత్రణ సాధించాలని ఖతార్ భావిస్తోంది. వీసా ఆన్ అరైవల్ ఇస్తే ప్రయాణికుల పూర్తి నేపథ్యాన్ని వారు దేశానికి రాకముందే పరిశీలించడం కష్టం. అదే ముందస్తు వీసా అయితే, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా తనిఖీ చేసే అవకాశం ఉంటుంది.

దౌత్యపరమైన వ్యూహాలు - పాక్ ప్రతిపాదన

మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అంతర్జాతీయ స్థాయిలో దౌత్య ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. యుద్ధం ఆరో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో పాకిస్థాన్ కొన్ని ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇరాన్ హార్మూజ్ జలసంధి ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరించాలని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని పాక్ కోరుతోంది.

# రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై అతి భీకర దాడులు

### ట్రంప్ కీలక ప్రకటన



**వాషింగ్టన్ :** ఇరాన్‌తో కొనసాగుతోన్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రానున్న రెండు, మూడు వారాల్లో ఆ దేశంపై భీకర దాడులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇరాన్ కీలక నాయకత్వం అంతమైందని, ఆ దేశ నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్ తుడిచిపెట్టుకుపోయాయన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలని.. లేకపోతే ఆ దేశాన్ని రాతియుగానికి తీసుకెళ్తామని హెచ్చరించారు. యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితి లేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతోందన్నారు. ఇరాన్‌పై నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తి చేసే దిశగా తాము ముందుకుసాగుతున్నామని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయిందన్నారు. వారి సైనిక సామర్థ్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఆ దేశంలోని కీలక నాయకత్వాన్ని తొలగించామని పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగిఉండేందుకు వీలులేదని పునరుద్ఘాటించారు. ఇరాన్ చమురును లక్ష్యంగా చేసుకొని ఇప్పటివరకు తాము దాడి చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, అవసరమైతే తాము వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. అమెరికా భద్రత కోసమే ఈ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని ప్రారంభించామని వ్యాఖ్యానించారు. యూఎస్‌ను అంతం చేయాలని ఇరాన్ కోరుకుంటోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై యుద్ధాన్ని త్వరలోనే ముగిస్తామన్నట్లు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. అమెరికా తన లక్ష్యాలను చేరుకుందని.. ఇది అతి త్వరలోనే ముగుస్తుందని అన్నారు. యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు పెరగడంపై కూడా ఆయన మాట్లాడారు. ఇది తాత్కాలికమేనని అన్నారు.

### హర్మూజ్ అవసరం లేదు..

ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ జలసంధి నుంచి వచ్చే చమురుపై యూఎస్ ఆధారపడటం లేదని.. భవిష్యత్తులో కూడా దాని అవసరం ఉండదన్నారు. దీనిపై ఆధారపడిన దేశాలే.. ధైర్యాన్ని కూడగట్టుకొని జలసంధిని చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇరాన్ ప్రతీకార దాడులతో విరుచుకుపడుతున్న గల్ఫ్ దేశాలకు అండగా ఉంటామని ట్రంప్ పేర్కొన్నారు. తమ మిత్ర దేశాలకు ఎలాంటి హాని జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

# 'జననాయగన్' విడుదల విషయంలో కుట్ర: విజయ్



**తమిళనాడు :** కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా విడుదల విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సినిమా విడుదలను ఉద్దేశించి ఆయన కీలక ఆరోపణలు చేశారు. విడుదల విషయంలో కుట్ర జరుగుతోందన్నారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. "కరూర్ ఘటన ఒక ఉమ్మడి కుట్ర అని చాలామంది చెబుతున్నారు. మీకు న్యాయం జరగాలని నేను ఎలా అయితే కోరుతున్నానో.. నాకు కూడా న్యాయం కావాలని కోరుతున్నా" అని విజయ్ అన్నారు. తన సినిమా 'జననాయగన్' విడుదల విషయంలో ఏదో జరుగుతోందని ఆరోపించారు. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. "తన కుటుంబానికి ఏదైనా సమస్య వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే దిల్లీ విమానం ఎక్కేస్తారు. ఎల్పీజీ సిలిండర్ల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన దేశ రాజధానికి వెళ్లరా?" అని ప్రశ్నించారు. నటుడిగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించి.. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

# అమెరికా అవమానపడే వరకు యుద్ధం ఇలాగే..: ఇరాన్



**ఇరాన్:** ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని.. వారి నాయకత్వాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ సైన్యం దీటుగా స్పందించింది. తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని స్పష్టం చేసింది. అంతేకాదు.. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి చేసిన ప్రకటనను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తిస్థాయి సమాచారం లేదని ఇరాన్ పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతోపాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామన్న ట్రంప్ వాదనలను ఖండిం చింది. మరోవైపు, ఇరాన్‌ను రాతియుగంలోకి పంపిస్తామని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందిం చింది. రాతియుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి అమె రికా తీసుకొస్తోందని.. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలను ఆధునిక ప్రపంచంలోకి తెస్తోందని దుయ్యబట్టింది.

### భారత మిత్రులు సురక్షితంగానే

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అంతకు ముందు.. హర్మూజ్ భవిష్యత్తును ఇరాన్, ఒమన్‌లు మాత్రమే నిర్ణయిస్తాయని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. దక్షిణాఫ్రికా పౌరులు సురక్షితమేనని పేర్కొంటూ పోస్టు చేయగా.. దీనికి భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పందించింది.

# బొగ్గు స్మగ్లింగ్ స్కామ్.. ఐప్యాక్ ఆఫీసుల్లో ఈడీ సోదాలు




**న్యూఢిల్లీ :** రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో గురువారం దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు చేపట్టింది. పశ్చిమ బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, దిల్లీల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో అధికారులు సోదాలు చేపడుతున్నారు. ఈ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టిసారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం బెంగాల్‌లో ఇదే తరహా రైడ్స్ జరిగిన సంగతి తెలిసిందే. సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లారు. దీంతో సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి తమకు ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ ఆరోపించింది. ఆ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టీఎంసీతో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ తాజా పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.




# 85 వేల హెచ్1బీ వీసాల ఎంపిక ప్రక్రియ పూర్తి

వాషింగ్టన్: కొత్త ఆర్థిక సంవత్సరం 2027కు సంబంధించి నిర్దేశిత కోటా ప్రకారం 85 వేల హెచ్1బీ వీసాలకు లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు అమెరికా పౌరసత్వం, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. అలాగే సాధారణ, ఉన్నత డిగ్రీల ఎంపిక లాటరీలను కూడా పూర్తిచేసినట్లు తెలిపింది. లబ్ధిదారులు పనిచేసే సంస్థలకు ఈ జాబితాను అందించామని, వారు హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. ఏప్రిల్ 1 నుంచి 90 రోజుల్లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు కొత్తగా విడుదల చేసిన ఐ-129 ఫారమ్‌ను ఉపయోగిం చాలని స్పష్టం చేసింది. అమెరికాలోని సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఆసుపత్రులు ఎక్కువగా హెచ్1బీ వీసాల సాయంతో భారత నిపుణులను నియమించుకు ంటాయి. ఇటీవల తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం జీతం, నైపుణ్యం ఆధారంగా వీసా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. వేతనం ఎక్కువగా ఉండి, విశేషమైన నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఉంటుంది. తద్వారా మరీ అవసరమైతే తప్ప ఎక్కువ ఉద్యోగాల్లో అమెరికన్లను నియమించుకోడానికే సంస్థలు ఆసక్తి చూపిస్తాయని.. వీసా దుర్వినియోగం తగ్గుతుందని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది.



# దుస్సాహసానికి పాల్పడితే.. పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ :** ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పరోక్షంగా హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఉగ్ర చర్యలపై గతంలో దీటుగా బదులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న వేళ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ప్రస్తుత పరిస్థితుల్లో మన పొరుగు దేశం ఏవైనా కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చు. ఒకవేళ అదే జరిగితే.. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.



# నా చేతుల్లో ఏం లేదు


### అధికారులను నిర్బంధించడంపై దీదీ

**పశ్చిమబెంగాల్ :** పశ్చిమబెంగాల్‌లో 'సర్' విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించడంపై తీవ్ర దుమారం రేగుతోంది. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. అధికారుల నిర్బంధం విషయం తనకు తెలియదన్నారు. ప్రస్తుతం పరిపాలన తన చేతుల్లో లేదని వ్యాఖ్యానించారు. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడుతూ.. 'దీనికి బాధ్యులు ఎవరో నాకు తెలియదు. దీని గురించి నాకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. పరిపాలన నా చేతుల్లో లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తుంది. వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట వింటున్నారు. అధికారులందరినీ మార్చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సమగ్ర సర్వేపై ప్రజలు కోపంగా ఉన్నారని మమతా వ్యాఖ్యానించారు. మాల్దాలో జరిగిన ఘటన భాజపా కుట్రలో భాగమని ఆరోపించారు. వారిని ఓటమి భయం వెంటాడుతుందన్నారు. అందుకే.. అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కాషాయ పార్టీ భావిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపైనా ఆమె విరుచుకుపడ్డారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో వారు విఫలమయ్యారన్నారు. కాగా.. ఈ విషయంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు చేసేందుకు ఈసీకి అనుమతిచ్చింది.

# మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 :** పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గడంతో రూ.1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,440 తగ్గడంతో రూ.1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. గురువారం కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.






## లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు

**దిల్లీ:** దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా.. వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి. వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండా.. ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8% వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి. మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ.. ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా.. కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




## లాభాల్లో స్టాక్ మార్కెట్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కోలుకుని లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బలోపేతం కావడం, అన్ని రంగాల్లో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కారణంగా సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో 1526 పాయింట్ల నష్టం నుంచి సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల (క్రితం ముగింపు 73,134.32) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,545.81 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ.. చివరకి 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.70 పాయింట్ల లాభంతో 22,713 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్లు, బంగారం ఔన్సు 4616 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన ప్రీమియం మోటార్ సైకిల్ రోడ్‌స్టర్ 9.1ధరను భారీగా తగ్గించింది. 4680 భారత్‌సెల్‌పై రూపొందిన ఈ బైక్ ధరను ఏకంగా రూ.60 వేలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.1,89,999 ఉండగా.. రూ.1,29,999కు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఓలా తన గిగా ఫ్యాక్టరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్యాటరీ సెల్ (4680 భారత్ సెల్‌ను) ఈ మోటార్ సైకిల్‌లో వినియోగించింది. ఈ సెల్ తయారీ వేగవంతం చేసిన నేపథ్యంలో దీని ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో భాగంగా రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ ధరను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ మోటార్ సైకిల్‌ను లిమిటెడ్ టైమ్ విండోలో మాత్రమే కొనుగోలుకు అనుమతిస్తారు. ఏప్రిల్ 3న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనుగోలు విండోను తెరవనున్నట్లు ఓలా ప్రతినిధి తెలిపారు. రోడ్‌స్టర్ అందుబాటును బట్టి ఎప్పటికప్పుడు పర్చేజ్ విండో సమయాలను వెల్లడిస్తామని పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ 9.1 ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్లు వరకు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది.



# నితీశ్ మెరుపులు



## హైదరాబాద్‌కు తొలి విజయం
## చెలరేగిన అభిషేక్, హెడ్
## కోల్‌కతా ఓటమి

**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. గురువారం 65 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. క్లాసెన్ (52; 35 బంతుల్లో 4x4, 1x6), అభిషేక్ శర్మ (48; 21 బంతుల్లో 4x4, 4x6), హెడ్ (46; 21 బంతుల్లో 6x4, 3x6) మెరవడంతో మొదట సన్‌రైజర్స్ 8 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నితీశ్‌కుమార్ రెడ్డి (39; 24 బంతుల్లో 4x4, 1x6) కూడా బ్యాట్ ఝుళిపించాడు. ఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది. రఘువంశీ (52; 29 బంతుల్లో 6x4, 2x6) టాప్ స్కోరర్. ఉనద్కత్ (3/21), ఇషాన్ మలింగ (2/14), నితీశ్ (2/17) కేకేఆర్‌ను దెబ్బతీశారు.

### తడబడిన కోల్‌కతా

కోల్‌కతా ఛేదన మెరుపులతో ఆరంభమైంది. ఓపెనర్ ఫిన్ అలెన్ (28) వరుసగా 4, 4, 6, 6, 4 బాదేయడంతో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే పైన్ 25 పరుగులు ఇచ్చుకున్నాడు. రెండో ఓవర్లో అలెన్‌ను హర్ష్ దూబె ఔట్ చేసినా.. రఘువంశీ చకచకా సిక్స్‌లు, ఫోర్లు బాదడంతో అయిదో ఓవర్లో 67/1తో నిలిచింది కోల్‌కతా. కానీ రహానె (8)ను ఉనద్కత్ ఔట్ చేయడం, గ్రీన్ (2) రనౌట్ కావడంతో 74/3కు చేరుకుంది. ఆ స్థితిలో చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన రఘువంశీ.. రింకు సింగ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు.10 ఓవర్లలో 110/3తో లక్ష్యం దిశగానే సాగింది కేకేఆర్. అయితే శివాంగ్ ఓవర్లో (11వ) రింకు రెండు ఫోర్లతో ఊపందుకున్న దశలో సమన్వయలోపం కారణంగా రఘువంశీ రనౌట్ కావడం ఆ జట్టుకు పెద్ద దెబ్బ. కుదురుకున్న భాగస్వామ్యం విడిపోవడంతో కోల్‌కతా ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. నితీశ్ వరుస ఓవర్లలో అనుకుల్ (0), రింకు (35)లను ఔట్ చేసి ఆ జట్టును చిక్కుల్లోకి నెట్టాడు. సాధించాల్సిన రన్‌రేట్ 13కు చేరుకుంది. నరైన్ (12) రెండు సిక్స్‌లు బాదినా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. 15వ ఓవర్లో అతడు ఇషాన్ మలింగ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అదే ఓవర్లో రమణ్‌దీప్ (10) కూడా వెనుదిరగడంతో 154/7తో కేకేఆర్ అవకాశాలకు తెరపడ్డట్లయింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ ఎంతోసేపు నిలవలేదు. 226/8. ఇది పెద్ద స్కోరే. కానీ సన్‌రైజర్స్ ఆరంభం ప్రకారం చూస్తే తక్కువే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు హెడ్, అభిషేక్ జంట కళ్లు చెదిరే ఆరంభాన్నిచ్చింది. 5 ఓవర్లకే స్కోరును 70 దాటించింది. మొదట విరుచుకుపడింది హెడ్. ముజరబాని ఓవర్లో రెండు ఫోర్లు బాదిన అతడు.. వైభవ్ అరోరా బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు కొట్టాడు. జాగ్రత్తగా ఆరంభించిన అభిషేక్.. అయిదో ఓవర్లో జోరందుకున్నాడు. అతడు రెండు సిక్స్‌లు, మూడు ఫోర్లు బాదడంతో ఆ ఓవర్లో వరుణ్ చక్రవర్తి ఏకంగా 25 పరుగులు సమర్పించుకున్నాడు. ఓపెనర్ల జోరు చూస్తుంటే అభిమానుల ఆలోచన 300 వైపు కూడా మళ్లింది. కానీ సన్‌రైజర్స్‌కు షాక్. ఒక్కసారిగా ఆ జట్టు ఊపు కోల్పోయింది. బంతితో పుంజుకున్న కోల్‌కతా.. చకచకా వికెట్లు పడగొట్టి పోటీలోకి వచ్చింది. హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా 82 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యాన్ని కార్తీక్ త్యాగి విడదీశాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి అభిషేక్ స్కోరు 100 దాటించాడు. కానీ సన్‌రైజర్స్ 7 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి 118/4తో నిలిచింది. ముజరబాని ఒకే ఓవర్లో ఇషాన్ కిషన్ (14), అభిషేక్‌లను వెనక్కి పంపగా.. అనికేత్ వర్మ (1)ను అనుకుల్ రాయ్ ఔట్ చేశాడు. ఆ తర్వాత స్కోరు వేగం తగ్గిపోయింది. ఇన్నింగ్స్‌ను తిరిగి నిర్మించే పనిలో పడ్డ క్లాసెన్, నితీశ్‌కుమార్ రెడ్డిలు జాగ్రత్తగా ఆడారు. 16 ఓవర్లకు స్కోరు 175/4. ఆ తర్వాత నితీశ్, క్లాసెన్ బ్యాట్ ఝుళిపించారు. సన్‌రైజర్స్ ఆఖరి నాలుగు ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 51 పరుగులు రాబట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో కోల్‌కతా బ్యాటర్ కామెరూన్ గ్రీన్ అనూహ్యంగా రనౌటయ్యాడు. ఇషాన్ మలింగ వేసిన ఆరో ఓవర్ చివరి బంతికి బ్యాటర్ రఘువంశీ స్ట్రెట్ డ్రైవ్ ఆడాడు. కానీ ఇషాన్ బూట్‌కు తగిలిన బంతి అక్కడే ఆగిపోయింది. కానీ ఇది గమనించని నాన్‌స్ట్రైకర్ కామెరూన్ గ్రీన్ పరుగు మొదలుపెట్టాడు. రఘువంశీ కాస్త ఆలస్యంగా స్పందించాడు. అతడు వచ్చేలోగా బౌలర్ ఇషాన్ బంతిని అందుకుని రనౌట్ చేశాడు. అప్పటికి 31 పరుగులు చేసిన రఘువంశీ నిరాశతో పెవిలియన్ బాట పట్టాడు. అయితే రిప్లే చూసిన థర్డ్ అంపైర్.. గ్రీన్‌ను ఔట్‌గా ప్రకటించాడు. ఇషాన్ బంతిని అందుకుని వికెట్లను గిరాటేసే సమయానికి రఘువంశీని గ్రీన్ దాటలేదు. పైగా బౌలర్ ఎండ్‌కు సమీపంలోనే ఉండడంతో అంపైర్... గ్రీన్‌ను ఔట్‌గా ప్రకటించాడు.




### ఆ క్యాచ్‌పై దుమారం

మంచి ఊపు మీదున్న దశలో అభిషేక్ శర్మ ఔట్ కావడం సన్‌రైజర్స్‌ను దెబ్బతీసింది. అయితే అతడు ఔటైన తీరు వివాదాస్పదమైంది. ముజరబాని స్లో షార్ట్ బంతిని అతడు షాట్ ఆడగా.. డీప్ స్క్వేర్ లెగ్‌లో వరుణ్ చక్రవర్తి కళ్లు చెదిరే క్యాచ్ అందుకున్నాడు. నేలకు కొన్ని సెంటీమీటర్ల ఎత్తులో అతడు బంతిని ఒడిసిపట్టాడు. అయితే వరుణ్ క్యాచ్ స్పష్టంగా పట్టాడో లేదో తెలుసుకోవడం కోసం అనేక కోణాల్లో రీప్లేలు చూసిన మేనన్.. అభిషేక్ ఔటైనట్లు ప్రకటించాడు. ఈడెన్ గార్డెన్స్ దద్దరిల్లిపోయింది. అభిషేక్ అసంతృప్తితో మైదానాన్ని వీడాడు. ఈ ఔట్‌పై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



## వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?

దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.




## రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బిగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

## ఆంజనేయుడిపై సూర్యకిరణాలు

### ప్రత్యేక వీడియో పంచుకున్న మెగాస్టార్ చిరంజీవి

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంజనేయస్వామికి పరమభక్తుడనే విషయం తెలిసిందే. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయన ఒక ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. తన ఇంటిలోని పూజా మందిరంలో చోటుచేసుకొన్న ఓ అపురూప దృశ్యాన్ని ఈ వీడియోలో చూపించారు. ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవానుడి కిరణాలు మా ఇలవేల్పు హనుమంతుడిని స్పృశిస్తున్న అద్భుతమైన సన్నివేశాన్ని మీతో పంచుకుంటున్నాను' అని ఆయన ఈ వీడియో షేర్ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా మా పూజా మందిరంలో జరిగిన ఒక విశేషాన్ని మీతో పంచుకోవాలని ఈ వీడియో చేస్తున్నా. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూర్యకిరణాలు సప్త వర్ణాలుగా మారి మా పూజా మందిరంలో ఉన్న హనుమంతుడిని స్పృశిస్తూ ప్రసరించడం చూస్తుంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఇటీవల మనం అయోధ్యలో బాలరాముడి నుదిటిపై సూర్యకాంతి పడి మెరిసిన అద్భుతాన్ని చూశాం. అలాగే కోణార్క్, అరసవల్లి దేవాలయాల్లో కూడా సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే. అలాంటి దైవానుభూతి మా ఇంట్లోనూ ఆంజనేయుడిని స్పృశించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా' అని చిరంజీవి తెలిపారు. అనంతరం అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు చెప్పారు.






## రామాయణ టీజర్ విడుదల



రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు. దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.



## ఖాళీ గదిలో చాలా కష్టంగా అనిపించింది : మాళవిక మోహనన్

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్, విజయ్ సేతుపతి కాంబోలో రాబోతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పాకెట్ నవల'. వైవిధ్యభరిత చిత్రాల దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక సినిమాకు లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా సంగీతం అందిస్తుండగా, రాజ్ బి శెట్టి, కిషోర్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. టైలర్ డర్డెన్, కింగ్ ఫిస్ట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా, మాళవిక మోహనన్ ఈ సినిమా షూటింగ్ అనుభవాలను, తన మనసులోని భావాలను ఓ పోస్ట్ ద్వారా పంచుకున్నారు. మార్చి నెల తనకు మిశ్రమ అనుభవాలను ఇచ్చిందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా గురించి చెబుతూ.. "త్యాగరాజన్ మన తరంలోని అత్యుత్తమ దర్శకనిర్మాతలలో ఒకరు. ఆయన మార్గదర్శకత్వంలో పనిచేయడం నా కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన, సృజనాత్మకమైన అనుభవం. దీని గురించి తర్వాత మరింత వివరంగా రాస్తాను, ఇది చాలా పెద్ద కథ" అని ప్రశంసలు కురిపించారు. షూటింగ్ కోసం నెలంతా చెన్నైలోనే గడిపిన మాళవిక, ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఒంటరితనం గురించి ఎమోషనల్ అయ్యారు. "రోజంతా కష్టపడి పని చేసి తిరిగి ఖాళీ గదిలోకి రావడం చాలా కష్టంగా అనిపించింది. ఇంటికి దూరంగా ఉండటం నన్ను ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. ఒంటరితనంతో తీవ్రంగా పోరాడుతున్న సమయంలో మా కుటుంబం, ముఖ్యంగా మా అమ్మమ్మ నన్ను చూడటానికి చెన్నై రావడం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. వారితో కలిసి మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించడం, స్థానిక వంటకాలను రుచి చూడటం మర్చిపోలేని అనుభూతి" అని ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం ముంబై చేరుకున్న మాళవిక, సముద్రపు ఒడ్డున సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తూ తన ఇంటిపై ఉన్న ప్రేమని వివరించారు.

## డెకాయిట్ మూవీపై ఆసక్తి

### అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్

టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని



ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం.

## ఏడేళ్ల కల సాకారం కాబోతోంది

### రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com